

వీధి దీపాల సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వీధిదీపాలు సక్రమంగా వెలిగేలా చూడండి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు అంబర్‌పేట నియోజకవర్గంలో వీధిదీపాల సమస్య తలెత్తకుండా సక్రమంగా వెలిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, ఈ.విజయకుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ ఈఈ సంతోష్, డీఈ శ్రీకాంత్, ఏఈ సౌమ్య తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలోని అమ్మవారి ఆలయాల వద్ద ఆలయ కమిటీ నిర్వాహకుల సూచనల మేరకు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, వీధి దీపాల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత: చింతల శ్రీనివాస్

గోల్నాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ కాలనీలో పేరుకపోయిన చెత్తను, మట్టికుప్పలను శుక్రవారం కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన ఇంటి పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాజు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అరవింద్‌కుమార్‌యాదవ్, అభిషేక్ కెన్నడీ

కాంగ్రెస్ మాట ఇస్తే నిలబెట్టుకుంటుంది

● యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరవింద్‌యాదవ్

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే గొప్ప అధ్యాయమని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అనిల్‌యాదవ్ చిత్రపటాలకు అరవింద్‌కుమార్‌యాదవ్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ చెప్పినట్లే చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కెనడీ రాజు, అభిషేక్‌కెన్నడీ, గుర్రం చంద్రకళ, శంకర్, శీలం సత్యనారాయణ, యాదగిరిగౌడ్, జానకి సుధాకర్, మధుమతి, సాల్మన్‌రాజు, నర్సింగ్‌రావు ముదిరాజ్, మారిశెట్టి నర్సింగ్, రాజేష్‌గడ్డం, జగదీష్‌బాబు, సుబ్బారావు, గిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న 28 కులాల ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు మోహన్ జవాన్, తదితరులు

28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చడంలో జాప్యం

● ఐక్యవేదిక సంఘం నేతలు

నల్లకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని 28 కులాల ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు మోహన్ జవాన్, ఉపాధ్యక్షుడు బోరిద ప్రవీణ్‌కుమార్‌లు ఆరోపించారు. రాష్ట్రంలోని 28 కులాలను విచారణ జరిపి ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ బీసీ కమిషన్ కేంద్ర సాధికార మంత్రిత్వ శాఖకు నివేదిక అందజేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ అంశంపై తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోయారు. ఈ మేరకు శుక్రవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సంఘం అధ్యక్షుడు మోహన్ జవాన్, ఉపాధ్యక్షుడు బోరిద ప్రవీణ్‌కుమార్‌ల నేతృత్వంలోని ఓ ప్రతినిధి బృందం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఎంపీ ఈటల రాజేందర్ స్పందించి ఈ అంశంపై కేంద్ర మంత్రులతో చర్చించి వీలైనంత త్వరగా ఓబీసీ జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని వారన్నారు. ఎంపీని కలిసిన వారిలో 28 కులాల ఐక్యవేదిక సంఘం నేతలు ఈశ్వర్, పిల్లి సంజయ్‌కుమార్, మోహన్ చౌహాన్, జాజేరావు వేదాకర్, రామ్‌నివాస్‌వర్మ, తీపిరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నర్సింహ బస్తీ వీధిలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే రోగాలు దరిచేరవని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని నర్సింహబస్తీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హెర్బన్ మలేరియా పథకం ప్రకారం డ్రై డే దోమల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు చిన్న పిల్లలను పనులకు పంపించకుండా పాఠశాలలకు చేర్పించాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. సత్యానగర్ బస్తీలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి అమ్మ మాట-బాడి బాట కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం



పాశం దేవరాజు

కవాడిగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): టెంట్‌హౌస్ నుంచి యటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్ఆర్ టెంట్ హౌస్ సమీపంలో పాశం దేవరాజు (30) డ్రైవర్‌గా పనిచేస్తూ నివసిస్తున్నాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం సిరిసిల్ల ప్రాంతానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. ఈ మధ్య భార్య శిరీషతో గొడవ నగరానికి నాలుగు నెలల క్రితం వచ్చి ఎస్ఆర్ టెంట్ హౌస్‌లో డ్రైవర్‌గా పనిచేస్తు అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నెల 18వ తేదీన టెంట్‌హౌస్ నుంచి బయటకు వెళ్లిన దేవరాజు తిరిగి రాలేదు. టెంట్ హౌస్ యాజమాన్యం, కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దేవరాజు తల్లి లక్ష్మి గురువారం రాత్రి గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఆలయాల వద్ద అభివృద్ధి పనులు

ముషీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ మోహన్‌నగర్‌లోని పోచమ్మ, చాముండేశ్వరి దేవాలయాల వద్ద పెరిగిన చెట్ల కొమ్మలను శుక్రవారం జీహెచ్ఎంసీ ఆర్టికల్చర్ సిబ్బంది తొలగించారు. ఈ పనులను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చెట్లకొమ్మలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌నగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి కె.నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.



మోహన్‌నగర్‌లో అమ్మవారి ఆలయం వద్ద చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



ఆలయంలో మట్టి, చెత్త తరలింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగ సందర్భంగా రాంనగర్ డివిజన్‌లోని పలు చోట్ల అమ్మవారి ఆలయాల వద్ద చెత్త, మట్టికుప్పల తరలింపు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ రవిచారి జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్‌లోని బాకారంలోని అమ్మవారి ఆలయం వద్ద చెత్త, మట్టికుప్పల తరలింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న బోనాల పండగ జరిగే ఆలయ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఆలయాల వద్ద ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను కోరారు.



డీఎంసీ మారుతీ దివాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, తదితరులు

రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. శుక్రవారం డీఎంసీ మారుతీ దివాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఆమె తెలపారు. బాలప్పబాడలో రోడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలిపారు. బాలప్పబాడ, జమాల్‌బస్తీ, ఏకే భవన్‌లేన్, ధరమ్‌పాల్ గల్లీ, కాచిగూడ పెట్రోల్ బంక్‌లేన్, శాంతినికేతన్ హైస్కూల్ లేన్ తదితర ప్రాంతాలలో సీసీ రోడ్లు మంజూరైన ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని, ఈ పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె కోరారు. దీనికి డీఎంసీ మారుతీ దివాకర్ సానుకూలంగా స్పందించారని త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు రాహుల్, అరవింద్, క్షీరసాగర్, వాసు, బల్వీర్, సంతోష్, సుభాష్‌పటేల్, రాము, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతం రావు

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● డాక్టర్ ఎన్ గౌతం రావు

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతం రావు ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పథకం పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి డాక్టర్ ఎన్ గౌతం రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఆయన కోరారు. ఈ నెల 21న హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జయా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి అర్హత ఉన్న ప్రతి కార్యకర్త, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ వై.అమృత, రాష్ట్ర నాయకుడు నందకిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రముఖులకు పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సాహితీకిరణం సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాలవారికి పురస్కారాల ప్రదాన సభ జరిగింది. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో గానసభ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి మాట్లాడుతూ పురస్కారాలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు. సాహితీకిరణం సంస్థ మాసపత్రికను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. దత్తాత్రేయశర్మకు పింగళి జగన్నాథరావు స్మారక పురస్కారం, రమణ వెలమకన్నికి సిరిగాద నర్సయ్య స్మారక పురస్కారం, శైలజామిత్రకు బాలమ్మ పురస్కారం, రామచంద్రరావుకు చెంచురామారావు పురస్కారాలను రమణాచారి బహూకరించారు. అంతకుముందు ప్రదర్శించిన పాండవోద్యోగ విజయాలలోని శయన దృశ్యంలో పాల్గొన్న కళాకారులప్రతిభను ప్రశంసించారు.

కళాపోషకులు జి.వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన సభలో సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కళాజనార్ధనమూర్తి, బైస దేవదాసు, బాల గంగాధరయ్య తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్నవారితో రమణాచారి, తదితరులు



అంబర్‌పేట మహాకాళి బోనాలకు హాజరు కావాలని మాజీ ఎంపీ వీహెచ్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట బోనాలను ఘనంగా నిర్వహించాలి

● మాజీ ఎంపీ వి. హనుమంతరావు

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయంలో బోనాల పండగను ఈ నెల 25వ తేదీన ఘనంగా నిర్వహించాలని ఇందుకు తమవంతు సహకారం అందిస్తామని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అంబర్‌పేట ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. బోనాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం వీహెచ్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఉత్సవాల ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కోశాధికారి గండం శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



సన్మానం పొందిన నాట్యగురువులతో చంద్రవదన్, నాగేష్‌ముదిరాజ్

సమాజంలో గురువుల పాత్ర ఎంతో గొప్పది

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని హైదరాబాద్ మాజీ కలెక్టర్ ఆర్.వి. చంద్రవదన్, బీఆర్ఎస్ సీనియర్‌నేత నాగేశ్ ముదిరాజ్ అన్నారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని పలువురు నాట్యగురువులకు, వివిధ రంగాల ప్రముఖులకు ప్రతిభాపురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న చంద్రవదన్, నాగేశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉందని ఆ గురువులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత శిష్యులకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, మల్కాజ్‌గిరి కోర్టు మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్, నిర్వాహకులు విక్కీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నాట్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సికింద్రాబాద్-పాట్నా, ధనపూర్ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్ చివరి వారం వరకు పొడిగించినట్లు దక్షిణమధ్యరైల్వే అధికారులు తెలిపారు. పాట్నా-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు(నం.03253) ఆగస్టు 5నుంచి సెప్టెంబర్ 30వరకు(సోమ-బుధవారం) హైదరాబాద్-పాట్నా ప్రత్యేక రైల్(07255) ఆగస్టు 7 నుంచి అక్టోబర్ 2వరకు (బుధవారం), సికింద్రాబాద్-పాట్నా ప్రత్యేక రైల్(నం.07256) ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 27 వరకు (శుక్రవారం), ధనపూర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైల్ (నం.03225) ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 26 వరకు(గురువారం), సికింద్రాబాద్-ధనపూర్ ప్రత్యేక రైల్(నం.03226) ఆగస్టు 4 నుంచి సెప్టెంబర్ 29 వరకు(ఆదివారం) పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ బదిలీ

● మరో ఇద్దరు ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ సివిల్ సర్జన్లు బదిలీ

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పేరొందిన నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్ బదిలీ అయ్యారు. ప్రభుత్వ వైద్యుల బదిలీలలో భాగంగా డాక్టర్ శంకర్ జనగాం ప్రభుత్వ వైద్య కళాశాలకు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయనతో పాటు మరో ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు కొండల్ రెడ్డి మహేశ్వరం ఆస్పత్రికి, అనిల్‌కుమార్ యాదాద్రికి బదిలీ అయ్యారు. వీరితో పాటు ఆస్పత్రిలో ఉన్న ఆర్ఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి కూడా నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు అందజేస్తున్న ఆరుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు కూడా బదిలీ అయ్యారు. ఆస్పత్రిలో మైక్రో బయాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌కు ప్రమోషన్ రావడంతో ఆమె బదిలీ అయ్యింది. దీంతో ఈ విభాగంలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం చేస్తున్న బదిలీలతో ఫీవర్ ఆస్పత్రి ఖాళీ అయింది. డాక్టర్ శంకర్ 14 సంవత్సరాల పాటు ఫీవర్ ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. రోగులకు సరైన వైద్య సేవలు అందించడంలో ఆస్పత్రిని అభివృద్ధి చేయడంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎంతో ఉంది. ఇటీవల కాలంలో రోగుల తాకిడి ఆస్పత్రికి అధికంగా ఉంది. సరైన వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

నేడు ఐఐటీహెచ్ స్నాతకోత్సవం

కంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్‌లో జరిగే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం హాజరుకానున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ఐఐటీ హైదరాబాద్ వేదికగా బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీలలోని వివిధ విభాగాలకు చెందిన దాదాపు 1,100 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకోనున్నారు. గత సంవత్సరం ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ చేతుల మీదుగా 980 మంది విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. అందులో నలుగురు గోల్డ్ మెడల్స్, 38 మంది సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సంవత్సరం ఐఐటీ హైదరాబాద్‌లో డిగ్రీ పట్టాలు అందుకునే విద్యార్థుల సంఖ్య తొలిసారిగా వెయ్యి దాటబోతుందని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకుండా పనిచేయాలి

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ఎక్కడా కూడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. పారిశుధ్య కార్మికుల పనులను కార్పొరేటర్ పావని శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల విషయంలో పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. గగన్‌మహల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కట్టమైసమ్మ టెంపుల్, బరాక్‌బాగ్, సాధురామ్ ఐ ఆస్పత్రి, ఎంసీహెచ్ డంప్‌యార్డ్ ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 12 వరకు, ఏవీ కాలేజ్ పరిధిలోని గగన్‌మహల్, పోలీస్ ఔట్‌పోస్ట్, గగన్‌మహల్, బాలసాయిబాబా టెంపుల్, పీజేఆర్ రెసిడెన్సీ, ఏవీ కాలేజ్, బాదమ్‌గల్లీ, జ్యోతి మార్కెట్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలి

● చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ అయిన సందర్భంగా రైతులకు సైబర్ కేటుగాళ్ల నుంచి ప్రమాదం పొంచి ఉందని రైతులు జాగ్రత్తగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. ప్రతి రైతు జాగ్రత్తగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులకు ఏదైనా వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని మెసేజ్‌లు వచ్చినా, ఓటీపీలు వచ్చినా కూడా ఎవరితో పంచుకోకుండా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఈశ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

● కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులందరూ ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్మికశాఖ తెలంగాణ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ గంగాధర్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 40 లక్షల మంది కార్మికుల పేర్లను నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ శ్రమ్‌లో పేరు నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సులోపు ప్రతి అసంఘటిత కార్మికులు ఈశ్రమ్ పథకంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈశ్రమ్ పథకం ద్వారా వివిధ సామాజిక భద్రత పథకాలు అందించడం జరుగుతుందని వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ దీప్తి ప్రియాంక



డాక్టర్ దీప్తి ప్రియాంక

ముషీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల తమ ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైరల్ ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్, ప్యారాసిటమోల్ ట్యాబ్‌లెట్లను అందజేస్తున్నామన్నారు. మలేరియా, డెంగీ కేసులు ఆరు నెలల్లో ఒకటి మాత్రమే నామోదయిందన్నారు.



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, ప్రధాన కార్యదర్శి కరుణ

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అసెంబ్లీలో చర్చిస్తాం

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అమలు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆశావర్కర్ల డిమాండ్లను అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. సంతోష, ప్రధాన కార్యదర్శి కరుణ శుక్రవారం ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్ల వేతనాలు నెలకు రూ.18 వేలకు పెంచాలని, ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, అర్హత కలిగిన ఆశాలను ఏఎన్ఎంలుగా పోస్టింగ్ ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ ప్రకారం కాకుండా అదనపు పని చేయిస్తే అలవెన్స్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పందించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తమ డిమాండ్లను అసెంబ్లీ ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి, తదితరులు

హరీష్‌రావు వెంటనే రాజీనామా చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల సమితి డిమాండ్

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుల రుణమాఫీకి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో మాజీ మంత్రి హరీష్‌రావు వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల రుణమాఫీ నెరవేరిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరిన మాజీ మంత్రి హరీష్‌రావు వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీతో రైతులందరూ రాష్ట్ర వ్యాప్తంగా పండగ చేసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రతినిధులు కే.సీ.ఎం.ప్రసాద్, ఎం. వెంకటస్వామి, బి. రంగారెడ్డి, ప్రఫుల్ రాంరెడ్డి, శ్యాంసుందర్‌యాదవ్, వెంకటనారాయణ, కొండ స్వామి, దయానంద్, దామోదర్‌రెడ్డి, రాజయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా రాధాకృష్ణమూర్తి

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ నూతన ప్రిన్సిపాల్‌గా రాధాకృష్ణమూరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన హనుమాన్ నాయక్ మేడ్చల్ ఐటీఐ ప్రభుత్వ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్లేపల్లి ఐటీఐ కళాశాలలో పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది హనుమాన్ నాయక్‌కు వీడ్కోలు పలికి నూతన ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూరిని సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు విజయకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పేరు, వయసు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, చేపట్టిన ఆవిష్కరణను వివరిస్తూ 100 పదాలలో రాసి పంపాలని సూచించారు. అలాగే, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు లేదా ఆవిష్కరణ వీడియోకు చెందిన 2 నిమిషాల నిడివిని పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ నంబర్ 9100678543కు పంపించాలన్నారు. ఆగస్టు 3లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావు 7799171299, ఇన్నోవేషన్ మిత్రా వినీత్ సిద్ధార్థ 8712824996 లో సంప్రదించాలని సూచించారు.